www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 26 అక్టోబర్ 2023
5
చిత్తూరు



# జిల్లాకు రాయితీ సబ్సిడీ విత్తనాలు

**ప్రజాశక్తి- చిత్తూరు:** రబీ 2023- 24లో సబ్సిడీ కింద రైతులకు విత్తనాలు పంపిణీ చేయడానికి వ్యవసాయశాఖ కమిషనరు చిత్తూరు జిల్లాకు 69 క్వింటాళ్లు కేటాయించారని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళికృష్ణ తెలిపారు. మినుములు 34 క్వింటాళ్లు, పెసలు 20 క్వింటాళ్లు, నువ్వులు 15 క్వింటాళ్లు మొత్తం 69 గంటలు జిల్లాకు కేటాయించారని తెలిపారు. జిల్లా కేటాయించిన విత్తనాలను జిల్లాలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంటుందని కావలసిన రైతులు తమ గ్రామంలోని ఆర్బికే కేంద్రాలను సంప్రదించి పేరు నమోదు చేసుకొని సబ్సిడీ కింద విత్తనాలు పొందవచ్చునని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ప్రజారక్షణ భేరిని జయప్రదం చేయండి

- 4న జిల్లాకు సిపిఎం బస్సు జాతా
- ప్రజాప్రణాళికను విడుదల చేసిన సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిపిఎం పార్టీ జిల్లా నాయకులు

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం ఆధ్వర్యంలో ప్రజారక్షణ భేరి కార్యక్రమం జరుగుతున్నదని, దీన్ని జయప్రదం చేయాలని సిపిఎం ప్రజాప్రణాళికను బుధవారం చిత్తూరు సిపిఎం కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు ప్రజలందరినీ కలవరపరుస్తున్నాయని అన్నారు. ఎవరో వచ్చి మనల్ని ఉద్ధరిస్తారని ఎదురు చూసే కన్నా మన బతుకులను రాష్ట్ర భవిష్యత్తును సక్రమంగా నడిపించడానికి ప్రజలందరూ ఐక్యంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ఉద్యమంలో సిపిఎం అండగా ఉంటుందని తెలిపారు. రాష్ట్రాన్ని విడగొట్టి పది సంవత్సరాలు పూర్తికావస్తోందని, అప్పుడు కేంద్రంలోని బిజెపి నాయకులు మనకు అర చేతిలో స్వర్గం చూపించారని ఎద్దేవా చేశారు. ప్రత్యేక హోదా, పోలవరం జాతీయ ప్రాజెక్టు, కడప ఉక్కుఫ్యాక్టరీ, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ, కేంద్ర విద్యాసంస్థల ఏర్పాటు, రైల్వే జోన్ వంటి హామీల్లో ఏ ఒక్క హామీ కూడా అమలు కాలేదని గుర్తు చేశారు. లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం ప్రజారక్షణ భేరి కార్యక్రమం నవంబర్ 15న విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నదని, ప్రజా సంక్షేమం కోసం ప్రజాప్రణాళికను ప్రజలు ముందు ఉంచిందని తెలిపారు. కరెంట్ యూనిట్ రూపాయికే, పేదలకు 300 యూనిట్ల వరకు ఉచితంగా, స్మార్ట్ మీటర్లు వద్దు, ఛార్జీలు రద్దు చేయాలని, రూ.400లకే గ్యాస్, రూ.60లకే లీటర్ పెట్రోల్, డీజిల్, ఇసుక ఉచితం, అందరికీ సంక్షేమం పెన్షన్, రేషన్ కార్డులు, అన్ని రకాల పెన్షన్లు రూ.5వేలు, పేదలకు రెండు సెంట్లు ఇల్లు, ఐదు లక్షల ఆర్థిక సాయం, 40 వేల టీచర్లకు మెగా డీఎస్సీ, 2 లక్షల 50 వేల ప్రభుత్వ ఖాళీ పోస్టులు, నిరుద్యోగ భృతి నెలకు రూ.5వేలు, ఓపీఎస్ పునరుద్ధరణ, ప్రైవేటు ఉపాధ్యాయులు కనీస వేతనం, ఉద్యోగ భద్రత, భూమిలేని వ్యవసాయ కూలీలకు కౌలు రైతులకు రెండు ఎకరాల భూమి, అసలు పట్టాదారులకే అసైన్మెంట్ భూముల హక్కులు కల్పించడం, గ్రామీణ ఉపాధి హామీ పథకానికి 200 రోజులు, పని గ్యారంటీ అసంఘటితరంగా కార్మికుల కనీసం 26,000, సమగ్ర సంక్షేమ చట్టం స్కీం కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం, రైతులు గిట్టుబాటు ధర కల్పించడం లాంటి ప్రజాప్రణాళికను సిపిఎం విడుదల చేసిందని తెలిపారు. అదేవిధంగా జిల్లాలో కూడా పలమనేరులో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేస్తామని చెప్పిన హామీని అమలు చేయాలని, జిల్లాలో పండ్ల రైతులు ఆదుకోవడానికి ఫల్ప్ ఫ్యాక్టరీలను ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని, నగరిలో పవర్ లూం కార్మికులకు కూలి రేట్లు పెంచి, 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని, చిత్తూరు జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని సిపిఎం డిమాండ్ చేస్తున్నదని పేర్కొన్నారు. ప్రజారక్షణ భేరి జయప్రదం చేయడానికి నవంబర్ 4న జిల్లాకు వస్తున్న సిపిఎం బస్సు జాతాను జిల్లాలోని ప్రజానీకం పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కే.సురేంద్ర, పి.చైతన్య, బాల సుబ్రహ్మణ్యం, దాము, రామచంద్ర, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



నిజం గెలవాలి సభలో ప్రసంగిస్తున్న నారా భువనేశ్వరి



తిరుపతిలో స్వాగతం పలుకుతున్న జనసేన నేతలు



తండ్రి ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పిస్తూ...

# 'ఆయన'కు ప్రజలే 'ప్రాణం'

- 'నిజం గెలవాలి' సభలో నారా భువనేశ్వరి
- నారావారిపల్లి నుంచి బస్సుయాత్ర ప్రారంభం
- మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

**ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో**

'ఆయనకు ప్రజలంటే ప్రాణం.. పార్టీ కార్యకర్తలన్నా, నాయకులన్నా సొంత బిడ్డల్లా చూసుకుంటారు.. ప్రజలు, పార్టీ తరువాతనే కుటుంబం..' అని నారా భువనేశ్వరి అన్నారు. 'రాష్ట్ర ప్రభుత్వ అరాచక పాలనతో నిజం ఈ రోజు గెలవకపోవచ్చు.. ఎప్పటికైనా నిజం అనేది గెలిచి తీరుతుంది.. చేయి చేయి కలిపి రాష్ట్రాన్ని రక్షించుకోవాల్సిన తరుణం ఆసన్నమయ్యింది.. ప్రతి ఒక్క టిడిపి కార్యకర్తా కంకణబద్ధులై నిజాన్ని గెలిపించే పనిలో ఉండాలి..' అని నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి భావోద్వేగ ప్రసంగం చేశారు. 'నిజం గెలవాలి' బస్సు యాత్ర చంద్రగిరి నియోజకవర్గం నారావారిపల్లిలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం ప్రారంభమయ్యింది. అంతకుముందు ఉదయం 11 గంటలకు చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక భావోద్వేగానికి గురై గుండెపోటుతో మృతిచెందిన పాకాల మండలం నేంద్రగుంటకు చెందిన కనుమూరి చిన్నబ్బనాయుడు, చంద్రగిరిలో ప్రవీణ్‌రెడ్డి కుటుంబ సభ్యులను నారా భువనేశ్వరి స్వయంగా వెళ్లి ఓదార్చారు. ఎన్టీఆర్ ట్రస్టు తరపున ఒక్కొక్కరికి మూడు లక్షల చొప్పున ఆర్థిక సాయాన్ని అందజేశారు. అగరాల వద్ద జరిగిన 'నిజం గెలవాలి' బహిరంగసభకు మహిళలు పెద్దఎత్తున కదం తొక్కారు. 'రెండు రోజుల క్రితం నారావారిపల్లికి వచ్చాను.. ఎపుడూ కుటుంబమంతా వచ్చి ఎంతో సంతోషంగా గడిపేవాళ్లం.. ఈసారి ఒక్కదాన్నే వచ్చాను.. గతంలో ఆనంద క్షణాలు గుర్తుకొచ్చి చాలా బాధగా ఉంది' అని భావోద్వేగంతో కంట తడిపెట్టడంతో సభలో మహిళలు సైతం కన్నీరుమున్నీరవడం కనిపించింది.

45 ఏళ్ల రాజకీయ జీవితంలో చంద్రబాబు ప్రజల కోసమే ఆలోచించారు తప్ప, కుటుంబానికి పెద్దగా ప్రాధాన్యత ఇచ్చేవారు కాదన్నారు. ఎలాంటి ఆధారం లేకుండా తన భర్తను రాజమండ్రి సెంట్రల్ జైల్లో నిర్బంధించారని, త్వరలోనే కడిగిన ముత్యంలా చంద్రబాబు బయటకు వస్తారని, అప్పటివరకూ టిడిపి శ్రేణులంతా తనకు అండగా నిలవాలని కోరారు. రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత మాట్లాడుతూ ఒక ముఖ్యమంత్రి కూతురిగా, ఓ ముఖ్యమంత్రి భార్యగా ఎపుడూ బయటకు రాని భువనేశ్వరమ్మ ఈరోజు రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించేందుకు మీ ముందుకు వచ్చారన్నారు. ప్రతి తెలుగు మహిళా, ప్రతి టిడిపి అభిమాని ఆమెకు వెన్నుదన్నుగా ఉండాలన్నారు. మాజీ స్పీకర్ ప్రతిభాభారతి మాట్లాడుతూ '2024లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు అను నేను' ప్రమాణం చేస్తున్నా అని చెప్పేంత వరకూ టిడిపి శ్రేణులన్నీ ఒక్కటవ్వాలన్నారు. మాజీ మంత్రి అమరనాథరెడ్డి మాట్లాడుతూ తాము అధికారంలో ఉన్న ఐదేళ్ల చిత్తూరు జిల్లాలో వైసిపి కార్యకర్తలపై ఓ కన్నేసి ఉంటే ఈరోజు జగన్ ప్రభుత్వం ఉండేదా? అని ప్రశ్నించారు. అదే చంద్రబాబుకు, జగన్‌కు తేడా అన్నారు. చంద్రబాబు రాష్ట్రాభివృద్ధి చూడాలంటారని, జగన్ రాష్ట్రం నాశనం కావాలని కోరుకుంటున్నారన్నారు. త్వరలోనే ప్రజలందరూ ప్రజాక్షేత్రంలో న్యాయాన్ని గెలిపించాలన్నారు.

ఈ టిడిపి అధికార ప్రతినిధి నల్లారి నరేష్‌కుమార్‌రెడ్డి, ఎంఎల్‌సిలు దొరబాబు, కంచర్ల శ్రీకాంత్, చంద్రగిరి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పులివర్తినాని, పులివర్తి సుధారెడ్డి, తిరుపతి మాజీ ఎంఎల్‌ఎ సుగుణమ్మ, శ్రీకాళహస్తి నియోజకవర్గ టిడిపి అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. 'నిజం గెలవాలి' అనే బ్యాక్‌డ్రాప్ బ్యానర్‌లో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఫొటో కనిపించింది. అయితే జనసేన శ్రేణులు ఎవరూ సభకు హాజరుకాకపోవడం గమనార్హం. అనంతరం 'నిజం గెలవాలి' బస్సు యాత్ర తిరుపతి నియోజకవర్గంలో అడుగు పెట్టింది. తిరుపతిలో గురువారం జ రగనున్న నిజం గెలవాలి సభను జయప్రదం చేయాలని మాజీ ఎంఎల్‌ఎ సుగుణమ్మ విజ్ఞప్తి చేశారు.

# డెయిరీ కార్మికుల ఘోష పట్టదా..?

- బకాయి వేతనాల కోసం 43 రోజులుగా రిలే దీక్షలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:**


దేశంలోనే అతిపెద్ద రెండో డెయిరీ, పాడి రైతుల కల్పతరవుగా విరాజిల్లింది చిత్తూరు విజయ సహకార డెయిరీ. అయితే అక్కడ పనిచేసిన కార్మికులు మాత్రం తమకు రావల్సిన బకాయి వేతనాల కోసం ఏళ్లతరబడి ఎదురుచూడాల్సి వస్తోంది. నేటికీ వారు 43 రోజులుగా కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షలు చేస్తున్నా ఇటు ప్రజాప్రతినిధులు, అటు అధికారులు పట్టించుకున్న పాపానపోలేదు. తమకు న్యాయంగా రావల్సిన బకాయి వేతనాల కోసం అన్నమో.. రామచంద్రా అంటూ కలెక్టరేట్ ఎదుట తిండీతిప్పలు మాని రిలే దీక్షలు చేస్తూనే ఉన్నారు.

గతంలో విజయ డెయిరీలో పనిచేసిన కార్మికులు విఆర్ఎస్ తీసుకోకుండానే తమ జీతాలను దారబోశారు. ఎప్పటికైనా డెయిరీకి పూర్వవైభం రాకపోతుందా అని ఎదురు చూశారు కానీ వారి ఆశలు అడిఆశలయ్యాయి. ప్రభుత్వం అమూల్ సంస్థకు ప్రభుత్వ విజయ సహకార డెయిరీ ఆస్తులను 99 సంవత్సరాలకు లీజుకు కట్టబెట్టింది. బకాయి జీతాలైనా అందుతాయని ఎదురుచూసిన కార్మికులకు నిరాశే మిగిలింది. ఇదిగో... అదిగో అంటూ అధికారులు డెయిరీ కార్మికులను ఆందోళనకు పూనుకోకుండా అడ్డుకుని అమూల్ సంస్థక అప్పనంగా విజయ డెయిరీ ఆస్తులను కట్టబెట్టారు. డెయిరీని సొంతం చేసుకున్న అమూల్ సంస్థ ఆధునీకరణ పనులను మొదలుపెట్టింది. రోజులు గడుస్తున్నా తమ బకాయి జీతాల విషయం తేల్చకపోవడంతో విధిలేని పరిస్థితిలో కార్మికులు రోడ్డెకాల్సిన స్థితి వచ్చింది.

గత నెల 12వ తేదీ నుండీ డెయిరీ కార్మికులు ఆందోళనకు పూనుకుటున్నారు. కార్మికుల కుటుంబ సభ్యులతో సహా అమూల్ డెయిరీ ఆధునీకరణ పనులను అడ్డుకున్నారు. అమూల్ డెయిరీ ఎదుటే గుడారం వేసుకొని రిలే దీక్షలను చేపట్టారు. పోలీసులు గుడారాలు పీకేయడంతో రిలే దీక్షలను కలెక్టరేట్ ఎదుట కొనసాగిస్తున్నారు. బుధవారానికి ఈ దీక్షలు 43 రోజుకు చేరుకుంది.

**డెయిరీ కార్మికు ఘోష..**

సహకార విజయ డెయిరీ 2002లో మూతపడ్డాక అప్పటి వరకు పనిచేస్తున్న కార్మికులు విఆర్ఎస్ తీసుకోగా 140మంది కార్మికులు విఆర్ఎస్ తీసుకోకుండా నాటి నుండీ ఏనాటికైనా డెయిరీ పునఃప్రారంభిస్తారని ఆశతో ఎదురు చూస్తున్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం అమూల్ సంస్థకు అప్పగించడంతో డెయిరీ పునఃప్రారంభం అవుతుందని, తమ బకాయిలు చెల్లిస్తారనే ఆశ ఎంతో కాలం నిలువలేదు. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమూల్ డెయిరీకి విజయ ఆస్తులను అప్పగిస్తూ చిత్తూరు బహిరంగ సభ నిర్వహిస్తే సిఎంను కలిసేందు వెళ్లిన సహకర విజయ డెయిరీ కార్మికుల కుటుంబాలను పోలీసులు అదుపులోకి తీసుకొని తలోదిక్కు వదిలేశారు. ఈ ఘటనలో రాష్ట్ర ప్రభుత్వ దుర్మార్గం అలస్యంగా అర్థం చేసుకున్న కార్మికులు పెండింగ్ జీతాల కోసం ప్రత్యక్ష ఆందోళనకు పూనుకోవాల్సి వచ్చింది. విజయ సహకార డెయిరీ పనిచేసిన కార్మికులు 140 మందిలో 22 మందికి పైగా చనిపోగా మిగిలిన కార్మికులు చనిపోయిన కార్మికుల కుటుంబ సభ్యులు తమకు రావాల్సిన జీతం బకాయిల కోసం ఆందోళన చేస్తున్నారు. గత 43రోజులుగా కార్మిక చట్టాల ప్రకారం రావాల్సిన పెండింగ్ బకాయిల కోసం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్నా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్, సహకార సంస్థ అధికారులు పట్టించుకొని తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. తమ కుటుంబాలు చితికిపోయాని పిల్లల చదువులు, వివాహాలు చేయలేక అనేక మంది కార్మికులు అనారోగ్యంతో అల్లాడుతున్న ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షలు చేస్తున్న కార్మికులు

# ఎస్‌జీఎఫ్ క్రీడా షెడ్యూల్ విడుదల

**26 నుంచి నవంబర్ 6 వరకు జిల్లాస్థాయి ఎంపికలు**

**ప్రజాశక్తి- నగరి :** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) జిల్లాస్థాయి క్రీడాఎంపికలకు సంబంధించిన క్రీడా షెడ్యూలును విడుదల చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వివిధ మైదానాలు వేదికగా అక్టోబర్ 26 నుంచి నవంబర్ 6వ తేదీ వరకు అండర్-14, అండర్-17 బాలబాలికల విభాగాల్లో జిల్లాస్థాయి ఎంపికలు నిర్వహించనున్నట్లు ఎసీఎఫ్ జిల్లా కార్యదర్శి సురేష్ తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు స్టడీ సర్టిఫికెట్, చైల్డ్ ఐడీ, పుట్టినతేదీ ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు తదితర సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

| తేదీ | క్రీడాంశం | వేదిక |
|---|---|---|
| 26.10.23 | బాల్ బాడ్మింటన్ | జడ్పీహెచ్ఎస్ మునగలపాళెం, ఏర్పేడు |
| | | సాఫ్ట్‌బాల్, ఎస్ఆర్ఎస్‌జీహెచ్, పుత్తూరు |
| 27.10.23 | ఫుట్‌బాల్ | జీడీసీ మైదానం, పలమనేరు |
| | చెస్ | ఎస్పిజెఎన్ఎంహెచ్ పాఠశాల, తిరుపతి |
| 28.10.23 | టెన్నికాయిట్ | జడ్పీహెచ్ఎస్, చిలమాకులపల్లి, ఎస్ఆర్‌పురం. |
| | జిమ్నాస్టిక్స్ | జడ్పీహెచ్ఎస్, ఏర్పేడు. |
| 30.10.23 | బేస్‌బాల్ | జడ్పీహెచ్ఎస్, మంగళం ట్రెండ్స్, తిరుపతి. |
| | వాలీబాల్ | జడ్పీహెచ్ఎస్, నెల్లేపల్లి, జీడీ నెల్లూరు. |
| 2.11.23 | క్రికెట్ | జీవీఎస్‌సీఎస్ స్టేడియం, వాల్మీకిపురం. |
| | సెపెక్‌తక్రా | జడ్పీహెచ్ఎస్ (బాయ్స్) రేణిగుంట. |
| 3.11.23 | సాఫ్ట్‌బాల్ | జడ్పీహెచ్ఎస్, పూతలపట్టు, చిత్తూరు. |
| | మోడన్ పెన్‌టేతియన్ | శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్,తిరుపతి |
| | రోప్ స్కిప్పింగ్ | జడ్పీహెచ్ఎస్, మదనపల్లి. |
| 4.11.23 | అథ్లెటిక్స్ | తుమ్మలగుంట స్టేడియం, తిరుపతి. |
| 6.11.23 | రగ్బీ | జడ్పీహెచ్ఎస్, బీఎన్ కండ్రిగ, తిరుపతి. |

# 27న డ్రాఫ్ట్ పబ్లికేషన్

**జనవరి 5న ఫైనల్ పబ్లికేషన్: డిఆర్ఓ**



సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఓ రాజశేఖర్

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్**

ఈవీఎంల ఫస్ట్ లెవెల్ చెకింగ్ జరుగుతోందని, ఈనెల 27న డ్రాఫ్ట్ పబ్లికేషన్ ఉంటుందని జనవరి 5న ఫైనల్ పబ్లికేషన్ ఉంటుందని జిల్లా రెవిన్యూ అధికారి ఎన్. రాజశేఖర్ అన్నారు. బుధవారం డిఆర్ఓ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27న డ్రాఫ్ట్ పబ్లికేషన్ ఉంటుందన్నారు. నవంబర్ 4, 5, డిసెంబర్ 2,3 తేదీలలో అన్ని పోలింగ్ కేంద్రాలలో బిఎల్వోలు అందుబాటులో ఉంటారన్నారు. ఆ తేదీల్లో మార్పులు చేర్పులకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. కసరత్తు జరిగే సమయంలో బిఎల్ఏలు అందుబాటులో ఉండేటట్లు ఆయా పార్టీల ప్రతినిధులు చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న ఫస్ట్ లెవెల్ చెకింగ్ కార్యక్రమం పూర్తి అయిన తర్వాత మాక్ పోలింగ్ నిర్వహించబడుతుందని తెలిపారు. డిసెంబర్ 27న సెప్టెంబర్ 30 వరకు చేసిన మార్పులు చేర్పులు పరిశీలనలోకి తీసుకొని జనవరి 5వ తేదీన ఓటర్ల జాబితా తుది పబ్లికేషన్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీ ప్రసన్న, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ బ్యూలా, సిపిఎం నుంచి గంగరాజు, వైఎస్సార్‌సీపీ నుంచి ఉదయకుమార్, కాంగ్రెస్ నుంచి పరదేశి, బిజెపి నుంచి శ్రీనివాసులు హాజరయ్యారు.

# స్విమ్స్‌లో బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి

**ప్రజాశక్తి- తిరుపతి సిటి**

స్విమ్స్ ఆస్పత్రిలో ఇటీవల జరిగిన వైద్యుల భర్తీ ప్రక్రియలో రూలాఫ్ రిజర్వేషన్ పాటించినందుకు డైరెక్టర్ ఆర్‌వి కుమార్‌ను ఎస్సీ, ఎస్టీ ఉద్యోగసంఘాల నాయకులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. త్వరలోనే చర్యలు తీసుకుంటామని డైరెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామ్మూర్తి, కోబాకు భూపాల్, పరమశివం, ప్రసాదరావు, భాస్కర్ పాల్గొన్నారు.

# భూగర్భ జలాల పెంపుకు పకడ్బందీ చర్యలు

కలెక్టర్‌ను కలసిన జలశక్తి అభియాన్ బృందం



జలశక్తి బృందంతో చర్చిస్తున్న జిల్లా కలెక్టర్

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** భూగర్భ జలాల పెంపుకుపై జలశక్తి బృందం సభ్యులు సచింద్ర కుమార్ పట్నాయక్, సోమరేంద్రో సింగ్‌లు బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్‌ను కలిసి చర్చించారు. ఈనెల 26, 27 తేదీల్లో జిల్లాలోని పలు మండలాల్లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎస్.షన్మోహన్ మాట్లాడుతూ జిల్లాలో జలశక్తి అభియాన్ పనులు పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వర్షపు నీరు సంరక్షణ, కుంటలు, చెరువులు పునరుద్ధరణ, ఫారం పాండ్, అమృత్ సరోవర్, ఫీడర్ ఛానల్ పనులు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో నిర్వహిస్తున్న పలు అభివద్ధి పనుల పురోగతిని కమిటీ సభ్యులకు వివరించారు. డ్వామా పీడీ గంగాభవాణి మాట్లాడుతూ కమిటీ సభ్యులు ఈనెల 26వ తేదీన సదుం మండలం తాటిగుంటపాళ్యం, కంబంవారిపల్లి గ్రామ పంచాయతీల్లో, సోమల మండలంలో నడింపల్లి, ఇరికిపెంట, చౌడేపల్లి మండలంలో అమనిగుంట, నుంజార్లపల్లి, పరికిదొన, గడ్డంవారిపల్లి బంగారుపాళ్యం మండలంలో పాలేరు గ్రామ పంచాయతీలలో పర్యటిస్తారన్నారు. 27వ తేదీన తవణంపల్లి మండలంలో తవణంపల్లి గ్రామపంచాయతీ, ఐరాల మండలంలో చినకాంపల్లి, వడ్రాంపల్లి, వీరప్పరెడ్డిగారిచెరువు, మిట్టూరు, కామినేనివారిపల్లి గ్రామపంచాయతీల్లో, యాదమరి మండలంలోని బుడితిరెడ్డిపల్లి, కోనాపల్లి, పెనుమూరు మండలం ఎల్‌కేపి ఊరు గ్రామాల్లో జరుగుతున్న అభివద్ధి పనులను కమిటీ సభ్యులు పరిశీలిస్తారని పీడీ వివరించారు. ఈ సమావేశంలో డ్వామా శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి: కమిషనర్

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** నేటి సమాజంలో ప్రతి ఒక్క మహిళ ఆర్థిక స్వావలంబన సాధించాలని, ఈ దిశగా మెప్మా మహిళలకు మార్గదర్శిగా నిలవాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ పిలుపునిచ్చారు. బుధవారం మిట్టూరులోని మెప్మా ప్రాజెక్ట్ కార్యాలయంలో నిర్వహించిన చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలోని భరతమాత పట్టణ మహిళా సమైఖ్య కార్యవర్గ సమావేశానికి కమిషనర్ అరుణ హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మహిళల్లో జీవనోపాదులను మెరుగుపరిచేలా కార్యక్రమాలను అమలు చేయాలన్నారు. మహిళ ఆర్థికంగా పురోభివృద్ధి సాధిస్తే తద్వారా కుటుంబం, సమాజం ఆర్థికంగా బలపడతాయన్నారు. తీసుకున్న రుణాలను ఎలా సద్వినియోగం చేసుకోవాలి, రుణాలను సమర్థవంతంగా తిరిగి చెల్లించడం ద్వారా కలిగే లాభాలను వివరించాలన్నారు. ఈసమావేశంలో భాగంగా క్షేత్రస్థాయిలో అమలవుతున్న కార్యక్రమాలపై ఆరా తీశారు. నగదు రహిత లావాదేవీలపై మహిళలకు మరింత అవగాహన కల్పించాలన్నారు. 'గుప్పెడు బియ్యం' కార్యక్రమం గురించి తెలుసుకొని అభినందించారు. కార్యక్రమంలో సీఎంఎం గోపి, మెప్మా జిల్లా ఇన్చార్జ్ ఐబీ శ్రీరాములు, సీవోలు, సమైఖ్య అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న నగర కమీషనర్ అరుణ

# 'జగనన్న పాలవెల్లువ' సర్వే చేపట్టండి: జెసి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జెసి, డిఆర్ఓ

**ప్రజాశక్తి- చిత్తూరు :** జగనన్న పాలవెల్లువ ఇంటింటా పాడి రైతుల ఇంటింటా సర్వే వెంటనే పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం డిఆర్ఓ యన్.రాజశేఖర్‌తో కలసి జగనన్న పాల వెల్లువ, జగనన్నకు చెబుదాం, అసైన్మెంట్ ల్యాండ్, రీసర్వే,22 ఏ, జగనన్నకు చెబుదాం, మీసేవ, ఏపీ సేవలపై జిల్లా కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండలాల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ జిల్లాలో జగనన్న పాల వెల్లువకు సంబంధించి రెండో విడతలో 11 మండలలలోని గ్రామాలలో పాడి రైతులకు సంబంధించి ఇంటింటా సర్వే పై తహశీల్దార్లు, ఎంపిడిఓలు ప్రత్యేక దష్టి పెట్టి రెండు రోజులలోగా సర్వేని పూర్తి చేయాలన్నారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న గ్రౌండ్ ట్రూథింగ్ (జిటి) సర్వేని వెంటనే పూర్తిచేయాలని, పెద్దపంజాని, బైరెడ్డిపల్లి, వి.కోట, గంగవరం, గుడుపల్లి మండలాలకు సంబంధించి సోమవారం కల్లా పూర్తి చేయాలని తెలిపారు. అలాగే సర్వే పూర్తి అయిన మండలంలోని సర్వేయర్లను మిగిలిన మండలాలకు పంపించి రెండు రోజులలో పూర్తిచేయాలని మండల సర్వేయర్లు ను ఆదేశించారు. స్టోన్ ప్లాంటేషన్ వందశాతం పూర్తి చేయాలని, ప్రభుత్వ భూములు, రీసర్వే అయిన పట్టా భూములకు సంబంధించి విఆర్ఓ లాగ్ఇన్ నుండి వచ్చిన వెంటనే తహశీల్దార్లు, ఆర్డీఓకు పంపించాలని తహశీల్దార్లను ఆదేశించారు. 22ఏ పూర్తి అయిన ప్రపోజల్స్‌ను కలెక్టర్ కార్యాలయంకు పంపించాలన్నారు. నోటిఫికేషన్ 13కు సంబంధించి 19 గ్రామాలకు సంబంధించి మళ్ళీ ఒకసారి పరిశీలించి సంబంధిత ఆర్డీఓల ద్వారా కలెక్టరేట్‌కు పంపించాలని తహశీల్దార్లను ఆదేశించారు. అసైన్మెంట్ ల్యాండ్ పట్టాలకు సంబంధించి టెక్నీకల్ సమస్యలుంటే వెంటనే పరిష్కారించుకొని పూర్తి చేయాలన్నారు. అనర్హుల ఉన్నారని తెలిస్తే సంబంధిత అధికారులపై కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జగనన్నకు చెబుదాంకు సంబంధించి 48 గంటలలోపు రాకుండా చూడాలన్నారు. జగనన్నకు చెబుదాం అర్జీలను ప్రతిరోజు పరిశీలించుకోవాలన్నారు. మీసేవ, ఏపి సేవకు సంబంధించి బియాండ్స్‌లోకి రాకుండా చూడాలని పెండింగ్‌లో ఉన్న వాటిని ఎప్పటికపుడు పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జడ్పీ సిఈఓ ఎం.ప్రభాకర్‌రెడ్డి, డిపిఓ లక్ష్మి, పశుసంవర్ధకశాఖ జెడి ప్రభాకర్, డిఎల్‌డిఓ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 'జగనన్నకు చెబుదాం' రద్దు

**ప్రజాశక్తి- గంగవరం:** మండల కేంద్రం గంగవరం ప్రజాపరిషత్ కార్యాలయంలో 27వ తేదీ శుక్రవారం జరగాల్సిన జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఎంపీడీవో మల్లికార్జున రెడ్డి బుధవారం ఓ ప్రకటనలతో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా జాయింట్ కలెక్టర్ సమాచారం అందజేయగా తదుపరి తేదీని జిల్లా పాలనాధికారి ప్రతిపాదించిన వెంటనే ఈ కార్యక్రమం జరుగుతుందని ఆయన తెలియజేశారు. ఈ సమాచారం మండల ప్రజాప్రతినిధులు, అధికారులు గమనించాలని ఆయన కోరారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

**ప్రజాశక్తి- సోమల:** మండల కేంద్రమైన సోమలలో మండల స్థాయి వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే' పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైసీపీ కార్యదర్శి పెద్దిరెడ్డి, నియోజకవర్గస్థాయి పరిశీలకులు జింక చలపతి పాల్గొన్నారు. అనంతరం ఇదే కార్యక్రమంలో నంజంపేట గ్రామానికి చెందిన రఘుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 38వేల రూపాయల చెక్కును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి వైసిపి శ్రేణులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు దుస్తులు పంపిణీ

**ప్రజాశక్తి-సోమల:** సదుం మండలం మొరవపల్లి పంచాయతీ గాదేవారిపల్లికి చెందిన ఎస్టి గ్రామంలోని నిరుపేద విద్యార్థులకు మాతృసేవా చారిటబుల్ సొసైటీ వారి ఆధ్వర్యంలో బుధవారం దుస్తులను పంపిణీ చేశారు. సొసైటీ నిర్వాహకులు విశ్వనాథ్ మాట్లాడుతూ సదుం, పాకాల, ఐరాల మండలాల పరిధిలోని ఎస్సీ, ఎస్టీ నిరుపేద కుటుంబాలకు చెందిన పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రతి ఏడాది ఉచితంగా దుస్తులు, విద్యాసామాగ్రి పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. ప్రతి విద్యార్థి పాఠశాలకు వెళ్లి చదువుకునే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని, బడి మానివేసిన పిల్లలను కూడా తమవంతు ప్రయత్నంగా తిరిగి పాఠశాలల్లో చేర్పించడం వారికి ఆర్థిక సహాయాన్ని అందించడం చేస్తున్నామని అన్నారు. దాత పచ్చార్ల జయచంద్ర నాయుడు చిన్నారులకు 80 జీన్స్ ప్యాంటులను పంపిణీ చేశారు. సొసైటీ సభ్యులు రామ్మూర్తి, గోపాల్, ప్రశాంతి, చిన్నబ్బా తదితరులు పాల్గొన్నారు.

**కార్వేటినగరం మండలాన్ని తిరుపతి జిల్లాలో కలపాలి**

## త్వరలో గ్రామస్థాయి పోరాటాలు

**ఆర్డీవోకు జనసేన వినతి**

**ప్రజాశక్తి- వెదురుకుప్పం:** కార్వేటినగరం మండలాన్ని తిరుపతి జిల్లాలో కలపాలని, లేకుంటే త్వరలో గ్రామస్థాయి పోరాటలు చేస్తామని గంగాధర్ నియోజకవర్గం జనసేన ఇన్చార్జి డాక్టర్ యుగంధర్ పొన్న నగరి డివిజన్ ఆర్డీవోను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో పెనుమూరు, వెదురుకుప్పం, కార్వేటి నగరం, ఎస్ఆర్ పురం, గంగాధర నెల్లూరు, పాలసముద్రం మండలాలను తిరుపతి జిల్లాకు అతి సమీపంలో ఉన్నాయని కనుక ఈ మండాలను తిరుపతి జిల్లాలో కలిపి ప్రజలకు దూరభారాన్ని తగ్గించాలని కోరారు. లేకుంటే త్వరలో గ్రామస్థాయిలో పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మండలాధ్యక్షులు విజయ్, ప్రధాన కార్యదర్శి నరేష్ ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న జనసేన పార్టీ నాయకులు

## సమస్యలుంటే చెప్పండి : తహాశీల్దార్

**ప్రజాశక్తి- వెదురుకుప్పం :** మండలంలోని దేవరగుడిపల్లి గ్రామ రెవెన్యూలో గల సిజేఎఫ్ భూములపై జరిపిన సర్వేపై ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా, ఎవ్వరైన ఇంకా అర్హత ఉండి సర్వేకి హాజరు కానివారు ఉన్నా తహాశీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని తహాశీల్దార్ రవికుమార్ తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అర్హత ఉన్న రైతులు వారంలోపు తహాశీల్దార్ కార్యాలయంలో అర్జీ ఇస్తే పరిశీలిస్తామని తెలిపారు. అలాగే దేవరగుడిపల్లి పంచాయతీ కార్యాలయంలో, వెదురుకుప్పం తహాశీల్దార్ కార్యాలంఓల ఏ1 నోటీసు ప్రచురించడమైదని ఈ విషయమై అభ్యంతరాలు ఉంటే అర్జీ ద్వారా సంప్రదించాలని తెలిపారు.

## ఆర్డీవో రవిశంకర్ రెడ్డి బాధ్యతలు స్వీకరణ

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:** శ్రీకాళహస్తి ఆర్డీవోగా ఎన్.రవిశంకర్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాళహస్తి ఆర్డీవోగా పని చేస్తున్న కేఎస్ రామారావును విజయవాడ కనకదుర్గ ఆలయ కార్య నిర్వహణాధికారిగా బదిలీ చేసిన సంగతి తెలిసిందే. ఆయన స్థానంలో కడప భూ సేకరణ విభాగం స్పెషల్ కలెక్టరు వద్ద పీఏగా విధులు నిర్వహిస్తున్న ఎన్. రవిశంకర్ రెడ్డిని శ్రీకాళహస్తి ఆర్డీవోగా నియమిస్తూ ఈ నెల 19వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ తరువాత వరుస సెలవులు రావడంతో రవిశంకర్ రెడ్డి బాధ్యతలు తీసుకోవడానికి ఆలస్యం జరిగింది. ఆర్డీవోగా బాధ్యతలు తీసుకున్న రవిశంకర్ రెడ్డిని డివిజను పరిధిలోని తహాసీల్దార్లు, రెవిన్యూ ఉద్యోగులు మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రజల వద్దకే వైద్యం: ఆర్‌కె రోజా



వికోటలో కిట్లు అందసేస్తున్న జెడ్‌పి ఛైర్మన్



విజయపురంలో వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న మంత్రి రోజా, కలెక్టర్

**ప్రజాశక్తి- వికోట:** రాష్ట్రంలోని ప్రజలందరికి సంపూర్ణ ఆరోగ్యం కల్పించాలన్న లక్ష్యంతో చేపట్టినదే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమని చిత్తూరు జిల్లా పరిషత్ ఛైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. మండల పరిధిలోని చింతమాకులపల్లిలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సందర్శించి వైద్యసేవలపై ఆరా తీశారు. ఈసందర్భంగా ఆరోగ్య శిబిరంలోని స్టాల్స్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం చైర్మన్ వైద్యపరీక్షలు చేయించుకుని ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం ప్రజల వద్దకే వైద్యబృందాన్ని పంపించి నిర్వహిస్తుందని, శిబిరాలను సద్వినియోగం చేసుకొని వైద్య ఖర్చులను తగ్గించుకొని మంచి ఆరోగ్యాన్ని పొందాలని ప్రజలకు సూచించారు. క్షేత్రస్థాయిలోని వైద్య సిబ్బంది ఈ వైద్య శిబిరం లక్ష్యాలను ప్రజలకు తెలియజేసి అధికసంఖ్యలో ప్రజలు సద్వినియోగం చేసుకునే విధంగా కృషి చేయాలన్నారు. ఎంపీపీ యువరాజ్, ముదరందొడ్డి సింగిల్ విండో అధ్యక్షులు గోపిరెడ్డి, ఎంపీడీవో మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

**విజయపురం:** స్థానిక మండలంలోని శ్రీహరిపురంలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మంత్రి ఆర్కే రోజా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జగనన్న సురక్ష సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్యం చేసుకున్న వారికి మెడికల్ కిట్టు పంపిణీ చేశారు. చిత్తూరు జిల్లా కలెక్టర్ షన్మోహన్ వైద్య శిబిరాన్ని సందర్శించి మందులు సదుపాయాలపై ఆరా తీశారు. అనంతరం జగనన్న హౌసింగ్ లేఔట్‌ను పరిశీలించి పనులు వేగవంతం చేయాలని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి హౌసింగ్ ప్లాట్ అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్వో రవిరాజు, ఎంపీడీవో చంద్రమౌళి, తహాశీల్దార్ వెంకటరాయలు, సిడిపిఓ కృష్ణవేణి, మండలాధ్యక్షులు గోపి పాల్గొన్నారు.

**చిత్తూరు అర్బన్:** జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా నాణ్యమైన వైద్యసేవలు ప్రజల ఇంటి వద్దనే అందుతున్నాయని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో 5వ వార్డు సచివాలయం వద్ద నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని బుధవారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ ఎస్ అముద పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారని ఇవన్నీ ప్రజలకు సంక్షేమ ఫలాలను అందించగా, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మెరుగైన వైద్యసేవలను అందిస్తోందన్నారు. అనంతరం జగనన్న మెడికల్ కిట్లను పంపిణీ చేసి ఐసిడిఎస్, డ్వాక్రా మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌లను సందర్శించారు. స్థానిక కార్పొరేటర్ సి.హరిణీ రెడ్డి, సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, సీఎంఎం గోపి పాల్గొన్నారు.

**నగరి:** ప్రతి కుటుంబానికి ఆరోగ్య భద్రత కల్పించేందుకే జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధి ఏకాంబరకుప్పంలో ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్యసురక్ష శిబిరాన్ని ఆయన పర్యవేక్షించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ బాలన్ మాట్లాడుతూ వైద్య రంగంలో ఏ ముఖ్యమంత్రి చేపట్టని విప్లవాత్మక మార్పులు సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీసుకువచ్చారన్నారు. వేల కోట్లు ఖర్చు చేస్తూ పేదలకు వైద్యాన్ని చేరువ చేస్తున్నారన్నారు. మున్సిపల్ మేనేజర్ శేఖర్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**చౌడేపల్లి:** మండలంలోని పెద్ద కొండామర్రిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సర్పంచ్ జయసుధమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాజుల రామ్మూర్తి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరం లాంటిదని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని ఆరోగ్య సమస్యలు పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం పలువురు కంటి వ్యాధిగ్రస్తులకు కళ్ళజోలను పంపిణీ చేశారు. ఎంపీడీవో సుధాకర్, వైసిపి సీనియర్ నాయకుడు నాగభూషణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు

**బంగారుపాళ్యం:** జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు ఒక వరం వంటిదని ఎంపీపీ అమరావతి అన్నారు. బుధవారం మండలంలోని సెట్టరి సచివాలయంలో జగనన్న ఆరోగ్యశ్రీ శాఖ పంచాయతీ కార్యదర్శి ఎల్లప్ప ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. అనంతరం కంటి వెలుగు కార్యక్రమంలో కంటి పరీక్షలు చేసుకున్న వారికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేపట్టారు. వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, మాజీ సర్పంచ్ అన్నా మల్ రెడ్డి, ఇన్చార్జ్ ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, మార్కొండయ్య వైద్యులు లోహిత్ చంగల్ రాయులు, తదితరులు పాల్గొన్నారు.

**గంగాధర నెల్లూరు:** జగనన్న సురక్ష పథకం పేదలకు వరం లాంటిదని గంగాధర నెల్లూరు మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఏకాంబరం అన్నారు. బుధవారం మండల పరిధిలోని పెద్దకాల్వ పంచాయతీ ఎన్టీఆర్ కాలనీలోని స్కూల్ వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు షర్మిల, దుర్గ, ప్రశాంత్, సీహెచ్‌వో శ్రీనివాసులు, ఫార్మసిస్ట్ నాగలక్ష్మి , ఎంఎల్ హెచ్‌పీ దీప్తి, ఏఎన్ఎం సుజాత పాల్గొన్నారు.

## క్రైం న్యూస్

### భూతగాదాలతో రైతు ఆత్మహత్య

**ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి:** భూ తగాదాల కారణంగా మస్తాపానికి గురైన ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బైరెడ్డిపల్లి మండలం మెట్టకురపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మెట్టకురపల్లి గ్రామానికి చెందిన చంద్రప్ప (35) తనకున్న పొలంలో వ్యవసాయం చేసుకుంటూ జీవించాలని అనుకున్నాడు. అయితే తన చిన్నాన ఏ.కృష్ణమూర్తికి చంద్రప్పకు మధ్య భూమి తగాదాలు రావడంతో సమస్యను పరిష్కరించాలని గ్రామపెద్దలు, రెవెన్యూ అధికారులు చుట్టూ తిరిగాడు. చివరికి స్పందన కార్యక్రమంలోనూ ఫిర్యాదు చేశాడు అయినప్పటికీ తనకు న్యాయం జరగపోవడంతో మస్తాపానికి గురైన చంద్రప్ప బుధవారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. గమనించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు.



మృతుడు చంద్రప్ప (ఫైల్ ఫోటో)

### భారీ అగ్ని ప్రమాదం

**రూ.25లక్షల ఆస్తి నష్టం**



మంటల్లో తగలబడుతున్న దుకాణం

**ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు:** మండలంలోని తూగుండ్రం గ్రామంలో బుధవారం తెల్లవారుజామున ఓ కార్పెంటర్ దుకాణంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.25లక్షల మేరకు నష్టం వాటిల్లిందని దుకాణ యజమాని వాపోయారు. మండలం తూగుండ్రం గ్రామంలోని కొత్త సచివాలయ కార్యాలయ భవనానికి సమీపంలోని పాలసముద్రం మండలం ఆముదాల పుత్తూరు గ్రామానికి చెందిన అరుణాచలం ఆచ్చారి, రవి ఆచ్చారి, రజని ఆచ్చారిలకు సంబంధించిన కార్పెంటర్ షాప్‌ను గత కొన్నేళ్ళుగా నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. బుధవారం తెల్లవారుజామున షాప్‌లో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో స్థానికులు చిత్తూరు అగ్నిమాపక కేంద్రం అధికారులకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపకం అధికారులు ఫైర్‌ఇంజన్ సహాయంతో మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే దుకాణంలోని తలుపులు, కిటికీలు, టేబుల్స్ తయారు చేసేందుకు ఉపయోగపడే వివిధ రకాల చెక్కలు, యంత్రాలు తగలబడిపోయాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.25 లక్షలకు పైగా నష్టం వాటిలిందని బాధితులు వాపోయారు. చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి, ఇన్చార్జి సీఐ రవి, గంగాధర నెల్లూరు ఎస్ఐ రామాంజనేయులు అగ్ని ప్రమాద సంఘటన స్థలాన్ని పరిశీలించారు.



## జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో వ్యాయామ ఉపాధ్యాయులు

**ప్రజాశక్తి- సోమల:** మండల కేంద్రమైన సోమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నియోజకవర్గస్థాయి టెన్నికాయిట్ పోటీలను అండర్ -17, అండర్ -14 విభాగంలో ఎంపిక కోసం నిర్వహించారు. ఈ పోటీలలో నియోజకవర్గ స్థాయిలోని ఆరు మండలాలకు చెందిన పలు పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు దాదాపు 80 మంది పాల్గొనగా వీరిలో 20 మంది క్రీడాకారులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. సోమల, సూరయ్యగారిపల్లి, నంజంపేట, కందూరు, పుదిపట్ల, చంద్రమాకులపల్లి, చారాల, పూజగానిపల్లి, విజయవాణి హైస్కూల్‌కు చెందిన పలువురు క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక అయినట్లు ఈనెల 28వ తేదీ ఎస్ఆర్ పురం మండలం చిల్లమాకులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు జరుగుతాయని ఆర్గనైజింగ్ కార్యదర్శి కరుణానిధి తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీలు చిన్నప్ప, శివకుమార్, కిషోర్, నూర్జహాన్, మురళి పాల్గొన్నారు.

## అంటువ్యాధులపై అవగాహన కల్పించండి



**ప్రజాశక్తి- యాదమరి :** అంటువ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించాలని రానున్న రెండునెలల్లో ప్రాణాంతకమైన జ్వరాలతో పాటు అంటువ్యాధులు కూడా ప్రభలే అవకాశం ఎక్కువగా ఉందని యాదమరి సిహెచ్‌ఓ లక్ష్మీనారాయణ సిబ్బందికి సూచించారు. బుధవారం యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షేత్రస్థాయి సిబ్బంది నెలవారి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిహెచ్‌ఓ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను మనం తప్పనిసరిగా పూర్తి చేయాల్సి ఉందన్నారు. అలాగే మాత శిశు సంరక్షణకై వారికి అందించాల్సిన వ్యాధినిరోధక టీకాలను సకాలంలో వేయాలన్నారు. గర్భవతుల నమోదు త్వరితగతిన కావాలని అలాగే ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాన్పు అయ్యేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. ప్రతిరోజు కేటాయించిన సమయంలో మీమీ పరిధిలోని గ్రామాలలో ఉదయం నుండి సాయంత్రం వరకు ప్రజలకు అందుబాటులో ఉండి వారికి అవసరమైన వైద్యసేవలు అందించాలని సూచించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా విధినిర్వహణలో తప్పులు లేకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో సూపర్వైజర్లు అనసూయమ్మ, లక్ష్మీపతి, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు బోరు మోటారు కేబుల్ ప్యానెల్ అందజేత

**ప్రజాశక్తి- సోమల:** మండల కేంద్రమైన సదుం ఎంపీడీవో కార్యాలయం వద్ద బుధవారం మండలంలోని ఇద్దరు రైతులకు జలకళ పథకం కింద మంజూరైన బోరు మోటారు, కేబుల్, ప్యానల్ బోర్డులను రాష్ట్ర వైసీపీ కార్యదర్శి పెద్దిరెడ్డి, పుంగనూరు నియోజకవర్గ పరిశీలకులు జింక చలపతి, సదుం జడ్పిటిసి సోమశేఖర్ రెడ్డిలు అందజేశారు. బూరగుమంద గ్రామానికి చెందిన చాంద్ బాషా, ప్రతాప్ అనే రైతులకు బోరు మోటారు, కేబుల్, ప్యానల్ బోర్డులను అందజేశారు. ప్రభుత్వం రైతుల అభివృద్ధి కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి ఉచితంగా బోర్లు వేయించడం మోటారు ఇతర వస్తువులను కూడా ఉచితంగా అందజేయడం జరుగుతోందని తెలిపారు.



బోరు మోటారు కేబుల్ ప్యానెల్ బోర్డు రైతులకు పంపిణీ పెద్దిరెడ్డి

## అనుమతి మాకెందుకు...?

**యథేచ్ఛగా ఎర్రబంగారం తరలింపు**




**ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్**

అధికార పార్టీ 'ముద్ర' వేసుకుంటే చాలు... అనుమతి లేకుండా ఎక్కడినుంచి ఎక్కడికైనా ఎర్రబంగారాన్ని యథేచ్ఛగా తరలించేయొచ్చు... అక్రమార్కులు రాత్రికి రాత్రే జేసీబీలతో తవ్వేయడం, టిప్పర్లతో సరిహద్దులు దాటించేయడం గప్‌చిప్‌గా జరిగిపోతుంది.. అధికారులు రాత్రుల్లో నిద్ర పోతున్న కారణంగా తెల్లారి స్థానికులు ఎవరైనా 'ఎర్రబంగారం తరలించారు' అని చెబితే.. 'ఔనా.. మాకు తెలియదు.. చర్యలు తీసుకుంటాం' అని చెప్పడం షరా'మామూలు' అయ్యింది.. వేడం పంచాయతీ ఓటు చెరువులో ఎటువంటి అనుమతి లేకపోయినా ఎర్రబంగారం యథేచ్ఛగా తరలిపోవడం గమనార్హం.

రాష్ట్ర ప్రభుత్వం ఇంటి నిర్మాణాలకు, ప్రభుత్వ భవనాల నిర్మాణానికి అనువుగా ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేసింది. తక్కువ ధరకే ఇసుకను అందుబాటులోకి తీసుకొచ్చామని చెబుతోంది. అయితే కొంతమంది అధికార పార్టీ నాయకులు ఎటువంటి అనుమతి లేకనే ఇసుక, గ్రావెల్, ఎర్రమట్టిని యథేచ్ఛగా తరలించేస్తున్నారు. బుధవారం వేడం పంచాయతీ ఓటుచెరువులో జేసీబీ సాయంతో టిప్పర్లతో ఎర్రమట్టి తరలిస్తూ 'ప్రజాశక్తి'కి కనిపించింది. చెరువును పరిశీలించగా పెద్దపెద్ద గుంతలతో భూగర్భజలాలు అడుగంటిపోయి ఉన్నాయి. వర్షం వచ్చి చెరువు నిండితే పెద్ద పెద్ద గుంతలే ప్రాణాలు తీస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయమై శ్రీకాళహస్తి రూరల్ ఇరిగేషన్ ఎఇ రాఘవేంద్రరావును వివరణ కోరగా వేడం పంచాయతీ ఓటు చెరువులో గ్రావెల్ తరలిస్తున్న విషయం తమ దృష్టికి రాలేదని తెలిపారు. ఓటు చెరువులో ఎవరికీ గ్రావెల్ తరలించడానికి అనుమతి లేదని, అక్రమంగా ఎవరైనా తరలిస్తున్నట్లు తమ దృష్టికి వస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు

## 'కల్కి'ని స్వాధీనం చేసుకోవాలి

**తిరుపతి(మంగళం):** కల్కి భగవాన్‌గా పిలువబడే విజయకుమార్ వరదయ్యపాలెం దగ్గర షుమారు 20 సంవత్సరాల క్రితం మూడెకరాల డెబ్బయి నాలుగుసెంట్ల ప్రభుత్వ భూమి ఆక్రమించి దాదాపు 500 కోట్ల రూపాయలతో ఆశ్రమాన్ని నిర్మించాడని, వెంటనే రాష్ట్రప్రభుత్వం ఈ ఆశ్రమాన్ని స్వాధీనం చేసుకోవాలని ఏపిహేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. బుదవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆక్రమణ జరిగినట్లు అప్పటి కలెక్టర్ కూడా నిర్థారించారని గుర్తు చేశారు.





## చీడపీడలతో...కూర'గాయాలు'



**ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)**

వర్షాధారమైన కరువు జిల్లాలో పాడి పరిశ్రమ రైతును ఎంతగా ఆదుకుంటుందో, అంతేస్థాయిలో కూరగాయలు, పండ్ల సాగు సైతం అన్నదాతకు ఆదరువుగా ఉంటోంది.. వంగ, బెండ వంటి కూరగాయల సాగులో చాలామంది సన్న చిన్న కారు రైతులు జీవనోపాధి పొందుతున్నారు. అయితే ఈ పంటల్లో చీడల సమస్య రైతులను భయపెడుతోంది. ఓ పద్ధతి ప్రకారం చర్యలు చేపడితే చీడలను అదుపులో ఉంచవచ్చు. ప్రస్తుతం సాగులో ఉన్న వంగ, బెండ తోటల్లో అక్షింతల పురుగు(పెంకు పురుగులు), కొమ్మ , కాయ తొలుచుపురుగు ఎక్కువ ఆశించి పంటను నష్టపరుస్తున్నాయని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఎడిఎ మెరుగు భాస్కరయ్య 'ప్రజాశక్తి'కి తెలిపారు. రైతులు అప్రమత్తంగా ఉండి చీడల నివారణ చేపడితే నాణ్యమైన కూరగాయలు పండుతాయని సూచించారు. ప్రస్తుతం కూరగాయల ధరలు రెండు నెలలుగా కిందకు దిగిరానంటున్నాయి. ఈ నేపథ్యంలో నాణ్యమైన కూరగాయలను మార్కెట్‌కు తరలిస్తే 'ఎ'గ్రేడ్ ధరను దక్కించుకోవచ్చని పేర్కొన్నారు.

అక్షింతల పురుగు పిల్ల పురుగులు శరీరంపై వెంట్రుకలు కలిగి, ఆకుల ఈనెల మధ్య పచ్చదనాన్ని తినేసి, ఆకులను జల్లెడగా



మారుస్తాయి. వీటి తల్లి పెంకు పురుగులు, ఆకులను, పూ మొగ్గలను తింటూ వాటిపై రంధ్రాలు చేస్తాయి. ఎదిగే మొక్కలలో కొమ్మ తొలిచే పురుగు ఆశించి కొమ్మ చివర్లు వాడి ఎండిపోయేటట్లు చేస్తాయి. కాయలు ఏర్పడే దశ నుండి ఈ పురుగులు కాయలలో రంధ్రాలు చేసి, పుచ్చు కాయలుగా చేసి అమ్మకానికి పనికి రాకుండా చేస్తాయి.

వంగ, బెండ పంటలను నాటిన తొలి దశలలో మొక్కలపై ఏవైనా అక్షింతల పురుగుల పెంకు పురుగులు గమనిస్తే వాటిని ఏరి నాశనం చేయాలి. కొమ్మతొలుచు పురుగు ఆశించిన రెమ్మలను ఎప్పటికప్పుడు కింది వరకు తుంచి నాశనం చేయాలి. పంట కాపుకు ముందు దశలో ఈ పురుగుల నివారణకు లీటరు నీటికి 2.5 మి.లీ క్లోరిపైరిపాస్, 2.5 మి. లీ క్వినాల్ ఫాస్, 2 మి.లీ ప్రొఫెనోఫాస్ లేదా 2 గ్రాముల లార్విన్ మందులలో ఒక దానిని 5 మి. లీ వేప మందుతో కలిపి స్ప్రే చేయాలి. అవసరాన్ని బట్టి 7-10 రోజుల వ్యవధిలో మందు మార్చి మరోసారి స్ప్రే చేయవచ్చును.

కాపు దశలో, ఈ పురుగుల నివారణకు, కాయలు కోసే ముందు, ఈ పురుగులు ఆశించిన రెమ్మలను, కాయలను, పిందెలను పూర్తిగా తొలగించి నాశనం చేయాలి. తర్వాత కాయలు కోసేయాలి. కాయలు కోసిన తర్వాత, తోటలోని చెట్లు బాగా తడియునట్లు లీటరు నీటికి 0.5 గ్రా ఎమామెక్టిన్ బెంజోయేట్, 0.4 మి. లీ కోరాజిన్, 2 మి.లీ ప్రొఫినోపాస్ లేదా 0.4 మి. లీ స్పైనోసాడ్ మందులలో ఒక దానిని 5 మి. లీ వేప మందుతో కలిపి స్ప్రే చేయాలి. అవసరాన్ని బట్టి, ఒకసారి కొట్టిన మందు తిరిగి కొట్టకుండా, మందు మార్చి 7-10 రోజుల వ్యవధిలో స్ప్రే చేయాలి. వంగ, బెండ కాయలు కోసేముందు రైతులు ఎట్టి పరిస్థితులలోనూ మందులు స్ప్రే చేయకూడదు.

ఈ కూరగాయల తోటలలో పచ్చ దోమ, తెల్ల దోమ, పెను వంటి రసం పీల్చే పురుగులు గమనిస్తే పై మందులతో పాటు లీటర్ నీటికి 0.5 మి. లీ ఇమిడాక్లోప్రిడ్ లేదా 2 మి. లీ రోగార్ మందును కలుపుకొని స్ప్రే చేయాలి.

# శెట్టిపల్లి...విసుగు చెంది..!

**ప్రజాశక్తి-తిరుపతిటౌన్**

శెట్టిపల్లి భూసమస్య దీర్ఘకాలికంగా పరిష్కారానికి నోచుకోకుండా ఉంది. దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూములకు హక్కులు కావాలని రైతులుతోపాటు కొనుగోలు చేసిన ఇళ్లస్థలాల లబ్దిదారులు డిమాండ్ చేస్తున్నారు. త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని అధికార పార్టీ నాయకులు చెప్పగా, అక్టోబర్ 25వ తేదీ 'ప్రొసీజర్స్' ఇస్తామని స్వయానా కలెక్టర్ వెల్లడించారు. అయితే ఇపుడు తిరుపతి ఆర్డీవో కనక నరసారెడ్డి బదిలీ అయ్యారనే 'సాకు' దొరికింది. కనీసం నవంబర్‌లో అయినా పత్రాలు ఇస్తారా? అని శెట్టిపల్లి రైతులు, లబ్దిదారులు ఆశగా నిరీక్షిస్తున్నారు.

శెట్టిపల్లి భూనిర్వాసితుల కమిటీ ఆధ్వర్యంలో దశలవారీ ఆందోళనలు చేయడం, అధికార పార్టీ నాయకులను, అధికారులను కలిసిన ఫలితంగా ఎట్టకేలకు ఇటీవల శెట్టిపల్లి భూములను సర్వే చేశారు. 'ఇపుడే పత్రాలు ఇచ్చేస్తాం' అని చర్చల సందర్భంగా అధికారులు, వైసిపి నేతలు చెబుతున్నా జాప్యం జరుగుతూనే ఉంది. వచ్చే ఎన్నికల్లోపు ఈ సమస్య పరిష్కరించే ప్రచారం చేయాల్సి ఉంటుంది. బాధితులకు వెంటనే న్యాయం చేయాలని వామపక్షాలు, వైసిపి నేతలు ఇటీవల కలెక్టర్ వెంకటరమణారెడ్డితో భేటీ అయ్యారు. అక్టోబర్ 25కల్లా న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. రైతులకు మొదటగా హక్కు పత్రాలు ఇస్తామని, ఇళ్లస్థలాలు కొనుగోలుదారులకు తరువాత ఇస్తామన్నారు. వామపక్ష నేతలు మాత్రం అందరికీ ఒకేసారి హక్కుపత్రాలు ఇవ్వాలని పట్టుబట్టారు. దీంతో అందరికీ పత్రాలు ఇచ్చేందుకు కలెక్టర్ ఓకే అన్నారు. ఇంతలోనే ఆర్డీవో కనక నరసారెడ్డి తాజాగా బదిలీ అయ్యారు.

**అక్టోబర్ ముగుస్తున్నా భూసమస్య యథాతథం**



### 251మంది రైతులకు పత్రాలు

శెట్టిపల్లి భూముల సమస్య పరిష్కరం చూపేందుకు అధికార్లు భూసేకరణ చేశారు. టిడిపి ప్రభుత్వం హయంలో ఒకసారి భూసేకరణ చేశారు. తరువాత వైసిపి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత మరో సారి భూసేకరణ చేశారు. తుడా ఆధ్వర్యంలో భూములు సర్వేచేసి నోటిఫికేషన్‌తో మొదలైంది. 251మంది రైతులు, 2208మంది ఇళ్లస్థలాల కోనుగోలు దారులుకు భూములపై హక్కులు కల్పించేందుకు పనులు మొదలు పెట్టారు. 2019లో మరోసారి భూసేకరణ చేశారు. రైతులు, ఇళ్లస్థలాల కోనుగోలు దారులు వద్ద ఉన్న 348.77 ఎకరాలును రీసర్వే చేసి ఇందులో 163.74 ఎకరాలు 251మంది రైతులు అర్హులుగా , 123.09 ఎకరాలు భూమికి 2206 మంది ఇళ్ల స్థలాలు యజమానులుగా గుర్తించారు. మరో 61.94 ఎకరాలు ఎలాంటి రికార్డులు లేకుండా కేవలం రైతుల అనుభవంలో ఉన్నట్లు గుర్తించారు. భూపత్రాల కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.

### వెంటనే పత్రాలు ఇవ్వాలి:సిపిఎం

శెట్టిపల్లి భూబాధితులకు వెంటనే అర్హత పత్రాలు ఇవ్వాలని సిపిఎం నగర కార్యదర్శి టి సుబ్రమణ్యం డిమాండ్ చేశారు. అధికార్లు వాయిదాలు వేయడం, ఆలస్యం చేయడం తగదన్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న బాధితులకు ఎందుకు న్యాయం చేయడం లేదని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ స్పందించి తర్వగా న్యాయం చేయాలన్నారు.